క్లుప్తంగా

అప్రమత్తంగా ఉండాలి



మహిళా పోలీసులకు సూచనలిస్తున్న సీఐ శ్రీనివాసరావు

సీతమ్మధార : వార్డు మహిళా పోలీసులందరూ అప్రమత్తంగా ఉండాలని సీఐ శ్రీనివాసరావు సూచించారు. ఫోర్త్‌టౌన్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో మంగళవారం మహిళా పోలీసులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ వార్డుల్లో ఎటువంటి సంఘటనలు జరిగినా వెంటనే తెలియజేయాలన్నారు. మహిళా ఎస్ఐ ప్రమిల పాల్గొన్నారు.

దుస్తుల వితరణ

మురళీనగర్: మురళీనగర్ వాకర్స్ పార్కు కమిటీ డైరెక్టర్ సూర్యనారాయణ సంక్రాంతి పురస్కరించుకుని వాచ్‌మన్ కుటుంబానికి నూతన వస్త్రాలు వితరణ చేశారు. ఇటీవల ఆయన వైశాఖి స్పోర్ట్స్ పార్కు వాచ్‌మన్‌కు కూడా నూతన వస్త్రాలను అందించారు. పేద కుటుంబాలకు తన వంతుగా సందర్భానుసారంగా సాయం అందిస్తున్నట్లు ఆయన చెప్పారు. వాకర్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు పల్లా చంద్రమౌళి, ఎల్‌వీ సుధాకర్ పాల్గొన్నారు.

భగవద్గీత ప్రచారకులు రంగనాథం కన్నుమూత



డాక్టర్ రంగనాథం (ఫైల్)

అల్లిపురం : గత 50 సంవత్సరాలుగా భగవద్గీతను వివిధ మార్గాల్లో ప్రచారం చేస్తూ ఎందరికో స్ఫూర్తి కలిగించిన డాక్టర్ వీవీ రంగనాథం (82) మంగళవారం వారి స్వగృహమందు భగవత్ సన్నిధికి చేరారని వారి కుటుంబ సభ్యులు తెలిపారు. ఇతను ఏవీఎన్ కాలేజీ వైస్ ప్రిన్సిపాల్‌గా పని చేసి పదవీ విరమణ చేశారు. వీరు రచించిన సచిత్ర గీతామృతము (బొమ్మలతో భగవద్గీత) చాలా ప్రాముఖ్యత సంతరించుకుంది. గీతా ప్రచార సమితి వివిధ హోదాల్లో పూర్ణానంద సమాజానికి గౌరవాధ్యక్షులుగా, గీతా సేవా ట్రస్ట్ అధ్యక్షుడిగా ప్రస్తుతం కొనసాగుతున్నారని పేర్కొన్నారు. రంగనాథం మృతికి నగరంలోని ప్రముఖులు సంతాపం తెలిపారు.

మాంసం దుకాణాల కిటకిట



నాటుకోళ్ల దుకాణం వద్ద జనాలు

సీతమ్మధార : ముక్కనుమ పండగా సందర్భంగా సీతమ్మధార, నక్కవానిపాలెంలోని చికెన్, మటన్ షాపులు కిటకిటలాడాయి. సంక్రాంతి ఆదివారం, సోమవారం కనుమ కావడంతో కావడంతో చాలా మంది నాన్‌వెజ్‌కు దూరంగా ఉన్నారు. మంగళవారం ముక్కనుమ కావడంతో ఉదయం నుంచి మటన్, చికెన్, నాటు కోళ్ల దుకాణాలు కొనుగోళ్ల దారులతో సందడిగా మారాయి.

సీతంపేటలో డెంగ్యూ ఫీవర్ సర్వే



సీతంపేటలో నీటి నిల్వలను పరిశీలిస్తున్న వైద్య సిబ్బంది

సీతంపేట: జీవీఎంసీ 25వ వార్డు సీతంపేటలో 7 ఏళ్ల అమ్మాయి డెంగ్యూ జ్వరం బారిన పడింది. దీంతో జీవీఎంసీ, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది అప్రమత్తమై మంగళవారం వ్యాధిగ్రస్తురాలి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వ్యాధికి గురైన బాలిక ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. బాధితురాలి ఇంటి చుట్టు పక్కల ఫీవర్ సర్వే నిర్వహించారు. ఎవరైనా జ్వరంతో బాధపడుతున్నారా? డెంగ్యూ కారక దోమలు ఎక్కడైనా పెరుగుతున్నాయా అని నీటి నిల్వలు తనిఖీ చేశారు. నీటిలో దోమ లార్వాలు గుర్తించి.. నీటిని పారబోశారు. దోమలు వృద్ధి చెందకుండా, జ్వరాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై స్థానికులకు అవగాహన కల్పించారు. హెల్త్ అసిస్టెంట్ కె.శ్రీనివాసరెడ్డి, హెల్త్ సెక్రటరీ అప్పలనరస, వలంటీర్లు, యాంటీ మలేరియా సిబ్బంది పాల్గొన్నారు.

గాలిపటాల సందడి



చెకాపంక్ అయిన గాలిపటాన్ని చేజిక్కించుకున్న బాలుడు



చెకాపంక్ అయిన గెద్దను తీసుకుని పరుగులెడుతున్న బాలుడు



గాలిపటమే ముఖ్యం అంటూ పట్టాలపైనే గాలిపటాలు ఎగురవేస్తున్న పిల్లలు

దాబాగార్డెన్స్: గాలిపటాలు ఎగురవేయాలంటే.. చిన్నోళ్ల నుంచి యువకుల వరకు.. ఇంకా చెప్పాలంటే మధ్య వయస్కులు కూడా ఎగిరి గంతులేస్తారు. వృత్తిరీత్యా ఒత్తిడిని ఎదుర్కొంటున్న వారు సంక్రాంతి నాటి నుంచి పండగ సెలవులు ఉన్నంత వరకు గాలిపటాలు ఎగురవేసే చిన్నారులతో మమేకమవుతుంటారు. ఇదిలా ఉండగా వారం రోజుల పాటు సంక్రాంతి సెలవుల్లో మునిగి తేలిన పిల్లలు, యువకులు బుధవారం నుంచి బడులు/కళాశాలలకు బయలుదేరుతున్న నేపథ్యంలో సోమ, మంగళ వారాల్లో పెద్ద ఎత్తున గాలిపటాలు ఎగురవేసేందుకు ఆసక్తి కనబరిచారు.

కొని తెచ్చుకుంటున్న ప్రమాదాలు.. : గాలిపటాల పోటీలు పెట్టుకోవడం.. ఆపై చెకాపంక్.. పోటీలో ఓ వర్గానికి చెందిన గాలిపటాన్ని చేజిక్కించుకోవడం. దీని కోసం రోడ్లపై పరుగులు తీస్తూ కొంత మంది చిన్నారులు రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారు. మరికొంత మంది కుర్రాళ్లు మేడలు.. మిద్దెల పైనుంచి పడిపోతున్నారు. ముఖ్యంగా మురికివాడ ప్రాంతాలైన ప్రసాద్‌గార్డెన్స్, బౌడారా రోడ్డు, రామకృష్ణా జంక్షన్, పండావీధి, వెలంపేట తదితర ప్రాంతాల కుర్రకారు గాలిపటాల పోటీల్లో నిమగ్నమవుతూ ప్రమాదాలు కొని తెచ్చుకుంటున్నారు.

గాలి పటం ఎక్కడికెళ్లినా.. : పోటీలో తెగిపోయిన గాలిపటం ఎక్కడ తేలుతుందో తెలియదు గానీ.. వాటి వెంబడి కుర్రకారు పరుగులు తీస్తున్నారు. ఇందిరా ప్రియదర్శిని మున్సిపల్ స్టేడియంలో గాలిపటాల పోటీలు వేసుకున్న వారిలో ఓ గెద్ద (గాలిపటం) తెగిపడి పోర్టులోని పరిసర ప్రాంతాల్లో పడితే.. దానిని చేజిక్కించుకోవడం కోసం చిన్నారులు పోర్టులోకి పరుగులు తీస్తున్నారు.

ఎంతైనా ఈ రెండు రోజులే కదా..

ఎంతైనా ఈ రెండు రోజులే కదా సార్. బుధవారం నుంచి బడులు ప్రారంభమైతే.. ఇక పుస్తకాల బాట పట్టాల్సిందేనని పలువురు చిన్నారులు చెబుతున్నారు. అప్పటి నుంచి వార్షిక పరీక్షల వరకు పెద్దగా సెలవులు ఉండవని, పెద్ద పరీక్షలు అయిన తర్వాత వేసవి సెలవుల వరకు మాకు ఆడుకోవడానికి తీరికే ఉండదని అంటున్నారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన



అష్టదళ పద్మారాధనలో పాల్గొన్న పలువురు ఉభయదాతలు

దాబాగార్డెన్స్: నగరంలోని బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె.శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో వెంపలి రాంబాబు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

19న సహస్ర తులసిపూజ

కనకమహాలక్ష్మి దేవస్థానంలో ఈ నెల 19న సహస్ర తులసిపూజ నిర్వహించనున్నామని ఈవో శిరీష తెలిపారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు పూజా రుసుం రూ.1500 చెల్లించాలని ఆమె పేర్కొన్నారు.

జ్యోతిబసు మార్గమే దేశానికి దిక్సూచి



జ్యోతిబసు చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న సీపీఐఎం నాయకులు

సీతమ్మధార : పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి జ్యోతిబసు మార్గమే ఈ దేశానికి దిక్సూచి అని సీపీఐఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు లోకనాథం అన్నారు. జ్యోతిబసు 13వ వర్ధంతి సభ మంగళవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం ఆవరణలో నిర్వహించారు. జ్యోతిబసు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా లోకనాథం మాట్లాడుతూ కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాతల్లో ఒకరైన కామ్రేడ్ జ్యోతిబసు కమ్యూనిస్టు పార్టీని బలోపేతం చేయడానికి కీలక పాత్ర వహించారని అన్నారు. కలకత్తా రైల్వే కార్మికుల యూనియన్ నాయకుడిగా బాధ్యతగా వ్యవహరించి కార్మికుల హక్కుల కోసం అనేక సమ్మెలు, పోరాటాలు చేశారని అన్నారు. 23 ఏళ్ల పాటు సుదీర్ఘకాలం పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రిగా జ్యోతిబసు బాధ్యతలు స్వీకరించి ప్రపంచ రికార్డు సృష్టించారని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు పి.మణి, ఎం.సుబ్బారావు, వి.నరేంద్ర, డి.అప్పలరాజు, జీవీఎన్ చలపతి, వెంకటరావు, కె.కుమారి, ఎం.సూరీడు, వై.రాజు తదితరులు పాల్గొన్నారు.

వార్డుల్లో చెత్త తొలగించాలి



పూర్ణామార్కెట్ వద్ద చెత్తను దగ్గరుండి తొలగింపజేస్తున్న జెడ్సీ శివప్రసాద్

జగదాంబ : పండగ నేపథ్యంలో వార్డుల్లో పేరుకుపోయిన చెత్తను త్వరితగతిన యార్డుకు తరలించాలని జీవీఎంసీ–జోన్ 4 కమిషనర్ కె.శివప్రసాద్ ఆదేశాలు జారీ చేశారు. మంగళవారం జోన్ పరిధి 35 వార్డు పూర్ణామార్కెట్, టౌన్ కొత్తరోడ్డు, రామకృష్ణ ప్రాంతాల్లో ఆయన విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా శివప్రసాద్ మాట్లాడుతూ మూడు రోజుల సెలవుల నేపథ్యంలో వార్డుల్లో చెత్త పేరుకుపోయిందన్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, పారిశుధ్య సిబ్బంది వెంటనే వార్డుల్లోని డస్ట్‌బిన్లలోని చెత్తను ఎత్తివేయాలని అన్నారు. రోడ్లు పరిశుభ్రం చేయాలన్నారు. కాలువల్లోని చెత్తను శుభ్రపరిచి, నీటి ప్రవాహానికి అడ్డు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. నైట్ స్వీపింగ్ చేసే పారిశుధ్య కార్మికులు పూర్తిస్థాయిలో విధులు నిర్వహించి పరిశుభ్రం చేయాలన్నారు. వార్డుల్లో ఇంటి నుంచి సేకరించే చెత్తకు అవసరం అయితే అదనంగా వాహనాలు ఏర్పాటు చేసి చెత్తను యార్డుకు తరలించాలన్నారు. 12 వార్డుల్లో ఎక్కడా అపరిశుభ్రత ఉండరాదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

యూజీడీ లీకుతో దుర్వాసన



రాజేంద్రనగర్‌లో లీకవుతున్న యూజీడీ మ్యాన్‌హోల్

సీతంపేట: జీవీఎంసీ 25వ వార్డు రాజేంద్రనగర్ వార్డు కార్యాలయం సమీపంలో యూజీడీ మ్యాన్‌హోల్ లీకవుతోంది. మురుగు నీరు రోడ్డెక్కి ప్రవహిస్తోంది. దీంతో రెండు వారాలుగా స్థానికులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఇళ్ల ముందు మురుగు నీరు ప్రవాహంతో దుర్వాసన భరించలేకపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

పేరుకుపోయిన చెత్తతో తిప్పలు



క్షత్రియ కల్యాణ మండపం రహదారిలో పేరుకుపోయిన చెత్త

సీతమ్మధార : జీవీఎంసీ 14వ వార్డులోని సీతమ్మధారలో గల పలు ప్రాంతాల్లో ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతోంది. క్షత్రియ కల్యాణ మండపంతో పాటు ప్రధాన రహదారుల్లో చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. డ్రైనేజీలోని చెత్త తీసి రోడ్డుపై వేయడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. చెత్తా చెదారంతో పాటు మురుగునీరు నిలిచిపోవడంతో దుర్గంధాన్ని భరించలేక స్థానికులు ఆందోళన చెందుతున్నారు. శానిటరీ అధికారులు స్పందించి పేరుకుపోయిన చెత్తను తొలగించాలని కోరుతున్నారు.

ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ మరో పదేళ్లు అమలు చేయాలి



అంబేడ్కర్ విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న నేతలు

అల్లిపురం: రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్‌ను మరో పదేళ్లు అమలు చేయాలని, దానికి ఎస్సీ, ఎస్టీ అభివృద్ధి నిధిగా పేరు మార్చాలని దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు జేవీ ప్రభాకర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు డాబాగార్డెన్స్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద మంగళవారం జరిగిన కార్యక్రమంలో అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సబ్‌ప్లాన్ గడువు ఈ నెలతో ముగుస్తుందన్నారు. కార్యక్రమంలో అంబేడ్కర్ మెమోరియల్ సొసైటీ అధ్యక్షుడు బొడ్డు కళ్యాణరావు, డీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఎస్.రాజు, కార్యదర్శి జి.రాంబాబు, ఉపాధ్యక్షుడు ఎం.సత్యనారాయణ, ఓంకార్, అంబేడ్కర్, రాజన రమణి, బి.అప్పారావు. ఐ.గురుమూర్తి, కోటేశ్వరరావు, ఎం.సత్యనారాయణ పాల్గొన్నారు.

నిరుపయోగంగా ప్రజా మరుగుదొడ్లు



నార్త్ ఎక్స్‌టెన్షన్‌లో నిరుపయోగంగా ఉన్న ప్రజామరుగుదొడ్లు

సీతమ్మధార: జీవీఎంసీ 14వ వార్డు నార్త్ ఎక్స్‌టెన్షన్ లోని ప్రజా మరుగుదొడ్లు నిరుపయోగంగా మారాయి. స్థానిక ప్రజల కోసం ఏర్పాటు చేసిన మరుగుదొడ్లను ఇప్పటి వరకు ప్రారంభించ లేదు. దీంతో వాటర్ ట్యాంక్ పాడైపోయింది. రేకులు తుప్పు పడుతున్నాయి. 10 మందికి ఉపయోగపడాల్సిన మరుగుదొడ్లు దిష్టిబొమ్మల్లా మిగిలిపోయా యి. వెంటనే మరుగుదొడ్లను వినియోగంలోకి తేవాలని పలువురు కోరుతున్నారు.

14 వార్డులో...

జీవీఎంసీ 14వ వార్డులోని నక్కవానిపాలెంలోని మరుగుదొడ్లు నిరూప యోగంగా ఉన్నాయి. 2002లో ఎ.ఎం.జి.రోడ్డులో అప్పటి కార్పొరేటర్ పెందుర్తి పుష్పాంజలి వీటిని ప్రారంభించారు. కొద్ది కాలం పాటు ప్రజలు వీటిని వినియోగించారు. గత కొద్ది కాలం నుంచి మరుగుదొడ్లకు తాళం వేసి ఉంది. ఇక్కడ ఏర్పాటు చేసిన బోర్డులో మాత్రం ఉదయం 4 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు ఉపయోగించవచ్చని కనిపిస్తోంది. జీవీఎంసీ అధికారులు చర్యలు తీసుకుని ప్రతిరోజూ మరుగుదొడ్లు తెరిచేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఘనంగా బల్లిగిరి వెంకన్న పరస మహోత్సవం


- విశేష అలంకరణలో స్వామివారు
- కిటకిటలాడిన గోవింద్‌రోడ్డు, సింహాలదేవిడి



విశేష అలంకరణలో బల్లిగిరి శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి



తోడపెద్దును ఆలయంలో తిప్పుతున్న అర్చకులు



విద్యుద్దీపాల కాంతిలో బల్లిగిరి వేంకటేశ్వరస్వామి దేవస్థానం



గోవింద్‌రోడ్డులో పరసకు వచ్చిన సందర్శకులు



రంగులరాట్నం వద్ద పిల్లల సందడి

అల్లిపురం: బల్లిగిరి శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానం సనాతన పరస మహోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా స్వామివారికి ఉదయం నుండి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయాన్ని, మూలవిరాట్టును విశేషంగా అలంకరించారు. ఆలయ ప్రధాన అర్చకుడు గొడవర్తి రాఘవాచార్యులు ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు చేపట్టారు. పరస మహోత్సవాన్ని పురస్కరించుకుని దేవస్థానం వద్ద, గోవింద్‌రోడ్డు, సింహాలదేవిడి రోడ్డు, అల్లిపురం మెయిన్‌రోడ్డు తదితర ప్రాంతాలు తీర్థం చూసేందుకు వచ్చిన జనాలతో కిటకిటలాడాయి. ఈ తీర్థ మహోత్సవంలో చిన్నారులు సందడి చేశారు. చిన్నపిల్లలు ఆడుకునేందుకు వీలుగా రంగుల రాట్నం, ఆకాశచక్రంతో పాటు జంపింగ్ బెంచ్‌లు ఏర్పాటు చేశారు. మహిళలు గృహాలంకరణ వస్తువులు, వ్యక్తిగత అలంకరణ వస్తువులు కొనుగోలు చేసేందుకు ఉత్సాహం చూపించారు.

ముఖ్యంగా చెరకు గడలు, పంచదార చిలకలు, కర్జూరం, వేపిన పప్పు, శనగలు వంటి వాటి వద్ద జనాలు అధిక సంఖ్యలో కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన భక్తి రంజని కార్యక్రమం ఆహూతులను ఆకట్టుకుంది. పరస మహోత్సవం సందర్భంగా బల్లిగిరి వెంకన్నను ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో కె.పద్మావతి, ఉత్సవ కమిటీ ప్రతినిధులు ఆడారి వెంకటమహేష్, బొడ్డేటి ప్రసాద్, బొడ్డేటి కిషోర్‌కుమార్, కర్రి నీలకంఠం, వెల్లంకి చిన్నమ్మలు, కణితి రమణమ్మ, కొల్లి సత్యవతితో పాటు 33వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు రంధి గోపీకృష్ణ తదితరులు ఆయనకు స్వాగతం పలికారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజల అనంతరం స్వామివారి శేష వస్త్రంతో సత్కరించి స్వామి వారి ప్రసాదాన్ని అందజేశారు.

అడ్డంగా వాహనాలు.. అవస్థలతో రాకపోకలు

- రోడ్ల పక్కనే వాహనాల నిలిపివేత
- ట్రాఫిక్‌కు అంతరాయం



జ్ఞానాపురం రహదారిలో మరమ్మతుల కోసం ఇలా పుట్‌పాత్‌లపై..



తాటిచెట్లపాలెం కూడలి రహదారిలో వాహనాల వరసలు

కంచరపాలెం: ప్రధాన, అంతర్గత రహదారులపై లారీలు, ట్రావెల్ బస్సులు పార్కింగ్ చేస్తుండటంతో రాకపోకలు సాగించేందుకు ఇతర వాహనచోదకులు, పాదచారులు నరక యాతన పడుతున్నారు. 5వ పోలీస్ స్టేషన్ పరిధి తాటిచెట్లపాలెం కూడలి నుంచి కంచరపాలెం వరకు, మర్రిపాలెం నుంచి ఇండస్ట్రియల్ ఎస్టేట్‌కు, ఇటు కంచరపాలెం నేతాజీ ఫ్లైఓవర్ వంతెన నుంచి జ్ఞానాపురానికి వెళ్లే రహదారుల్లో వాహనాలను నిలుపుతున్నారు. రెండేసి వరసల్లో వాహనాలు నిలిపి మరమ్మతులు చేపడుతున్నారు. నెలల తరబడి ఇదే పరిస్థితి ఉండటంతో చెత్త, మట్టి గుట్టలుగా పేరుకుపోతోంది. దీంతో శానిటరీ సిబ్బంది చెత్తను తరలించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఇరుకు రోడ్లపై కూడా వాహనాలు నిలిపివేయడం కారణంగా పలు చోట్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. కంచరపాలెం ఫ్లైఓవర్ వంతెన మార్గంలో ఎఫ్‌సీఐ గిడ్డంగికి వచ్చే లారీలు ఎక్కడ పడితే అక్కడ నిలుపుతుండడంతో ట్రాఫిక్ స్తంభించిపోతోంది. నిషిద్ధ సమయాల్లో భారీ వాహనాలు, టిప్పర్ల రాకపోకలకు అడ్డు లేకుండా పోతుంది. ట్రాఫిక్ నిబంధనలకు విరుద్ధంగా రాకపోకలు సాగిస్తున్నా.. పోలీసులు మిన్నకుండిపోతున్నారు. ఇప్పటికైనా ట్రాఫిక్ పోలీసులు స్పందించి.. నో పార్కింగ్ జోన్‌లో వాహనాలు నిలపకుండా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రయాణం నరకం

కంచరపాలెం నుంచి తాటిచెట్లపాలెం మీదుగా నగరానికి వెళ్లాలంటే భయాందోళన చెందుతున్నాం. నిత్యం భారీ వాహనాలు రహదారికి ఇరువైపులా నిలపడంతో రాకపోకలకు ఇబ్బందిగా ఉంది.

– ఈశ్వరరావు, ఐటీఐ జంక్షన్

వాహనాలను తరలించాలి

రహదారికి ఇరువైపులా ఏళ్ల తరబడి నిలిపిన వాహనాలను తరలిస్తే అటుగా ప్రయాణం చేసే వాహనాలకు ఇబ్బందులు ఉండవు. ట్రాఫిక్ పోలీసులు, జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు స్పందించి అలాంటి వాహనాలను తరలించాలి.

– రాంబాబు, ధర్మానగర్ కంచరపాలెం